నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శనివారం 14 జూన్ 2025 | JAGTIAL

# కలెక్టరమ్మా..
## మాకు న్యాయం చేయండి

- తహసీల్దార్ బారి నుంచి కాపాడండి
- రైతు కుటుంబాల వేడుకోలు
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన బాధిత కుటుంబాలు

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 13 : రెవెన్యూ అధికారుల ఆగడాలు రోజురోజుకూ శృతిమించుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల స్థాయిలో పెండింగ్ భూ సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలంటూ నిత్యం ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా, వాటిని పక్కన పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక అధికారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటున్నారని బాధితులు వాపోతున్నారు. విధిలేక కలెక్టర్ వద్ద కొచ్చి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. అయినా, పరిష్కారమార్గం దొరకక రోడ్డెక్కుతున్నారు. తాజాగా ఇదే తరహా సమస్యపై ఓ రెండు రైతు కుటుంబాలు నిరసన తెలిపాయి. ఇతరులకు విక్రయించిన తమ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలంటే సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ, బెదిరింపులకు గురిచేస్తున్న రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని తమ భూమి పట్టా కాగితాలతో కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించాయి. చిగురుమామిడికి చెందిన నిరుపేద రైతులు చిట్టెల మైసవ్వ, చిట్టెల రాములు శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట తమ కుటుంబసభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. కలెక్టర్ ఆదేశించినా తమకు న్యాయం జరగడం లేదని, ఇతరులకు విక్రయించిన తమ భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా తమను బెదిరిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడని, 'కలెక్టరమ్మా.. మాకు న్యాయం చేయండి' అంటూ వేడుకున్నారు. చిగురుమామిడి గ్రామంలోని తమ కుటుంబాలకు చెందిన 853 సర్వేనంబర్‌లో 2.37 ఎకరాల భూమిని విక్రయించామని, రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈ యేడాది మార్చి 28న స్లాట్ బుక్ చేశామని, అయితే ఈ భూమిపై ఫిర్యాదులు వచ్చాయంటూ తహసీల్దార్ రిజిస్ట్రేషన్ నిలిపేశాడని బాధితురాలి కొడుకు చిట్టెల కిష్టయ్య ఆరోపించాడు. దీనిపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అన్ని డాక్యుమెంట్లు పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారని, తమను ఏప్రిల్ 23న స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారని, ఆ మేరకు రీషెడ్యూల్ చేసుకున్నామని, మరుసటి రోజు కార్యాలయానికి వెళ్తే 'మాతంగి తిరుపతి మీ భూమిపై ఫిర్యాదు చేశాడు. రిజిస్ట్రేషన్ చేయం' అంటూ మళ్లీ పాత కథే చెప్పుకొచ్చాడని వాపోయాడు. కలెక్టర్ వద్దకు వెళ్దామని అంటూ తమను కరీంనగర్ తీసుకొచ్చి తనొక్కడే లోనికి వెళ్లి 'మేడం ఆపమన్నది' అని చెప్పాడని వాపోయాడు. సెటిల్‌మెంట్ చేస్తే తప్ప రిజిస్ట్రేషన్ కాదంటూ ఖరాఖండిగా చెబుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై ప్రజావాణిలో నాలుగుసార్లు కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తే తహసీల్దార్‌కు చీవాట్లు పెట్టారని, తననే మేడంతో తిట్టిపిస్తారా..? మీ సంగతి చూస్తానంటూ బెదిరిస్తున్నాడని కన్నీటి పర్యంతమయ్యాడు. తన తల్లి రెండు కిడ్నీలు చెడిపోతే వైద్యం కోసం ఉన్నభూమి విక్రయించామని, కొనుగోలు చేసిన రైతు పేర రిజిస్ట్రేషన్ చేసేందుకు తహసీల్దార్ తమను ముప్పుతిప్పలు పెడుతున్నాడంటూ బాధిత కుటుంబ సభ్యులు బావురుమన్నారు. కలెక్టరమ్మా కనికరించి తమకు న్యాయం చేయాలని, సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వైద్యం అందక తన తల్లికి ఏదైనా జరిగితే అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.



గోదావరిఖనిలోని సింగరేణి దవాఖానను సందర్శించి వివరాలు సేకరిస్తున్న జీఎం లలిత్‌కుమార్

# సింగరేణి దవాఖానలో
## జీఎం ఆకస్మిక తనిఖీ

'నమస్తే' కథనంతో
కదిలిన యాజమాన్యం

పెద్దపల్లి, జూన్ 13( నమస్తే తెలంగాణ)/ గోదావరిఖని: సింగరేణి ఏరియా దవాఖానలు, డిస్పెన్సరీలలో సరిపడా మందులు లేక సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంతో ఇటు సింగరేణి యాజమాన్యం స్పందించింది. వెంటనే మందులను అందుబాటులోకి తీసుకువచ్చింది. దానికి తోడు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సైతం గోదావరిఖని ఏరియా దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో మందుల స్టోరేజ్, రోగులకు అందిస్తున్న మందుల వివరాలను ఫార్మసీ కౌంటర్ వద్ద ఉద్యోగులను, మందులు అందుకుంటున్న కార్మికులు, కార్మికుల కుటుంబాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీ-1 పరిధిలోని సింగరేణి ఏరియా దవాఖాన, డిస్పెన్సరీలలో ప్రతిరోజూ 2500 మందికి ఓపీ సేవలందిస్తున్నట్లు తెలిపారు. 700 రకాల మందులు ఏరియా దవాఖానలో ప్రతి సంవత్సరం అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడ లేని మందులు సైతం రెండు నెలల్లో దాదాపు ₹15 లక్షలు ఖర్చు పెట్టి లోకల్ పర్చేస్ ద్వారా తెప్పించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా దవాఖాన డీవైసీఎంవో డాక్టర్ అంబికను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఏరియా దవాఖాన సిబ్బంది ఉన్నారు.

### కదిలిన కార్మిక సంఘాలు

'సింగరేణిలో మందుల కొరత' కథనంతో సింగరేణిలోని కార్మిక సంఘాల నాయకులు సైతం కదిలారు. దవాఖానలు, డిస్పెన్సరీల్లో మందులను వెంటనే అందుబాటులో ఉంచాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని ఏరియా దవాఖాన వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం దవాఖాన డీవైసీఎంవో అంబికకు వినతి పత్రం అందించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య సైతం స్పందించి కార్మికులకు, కార్మిక కుటుంబాలకు దవాఖానల్లో మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి దవాఖానల్లో అసౌకర్యాలను దూరం చేసి మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

# మొహర్రానికి నిధులు విడుదల చేయాలి

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పైసా ఇవ్వలేదు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 13: షియా ముస్లింలకు అత్యంత పవిత్రమైన మొహర్రం పండుగకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం 2023లో మొహర్రం నిర్వహణకు నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు. మొహర్రంకు ఏనుగుపై ఊరేగింపు తీయడం షియా ముస్లింల సంప్రదాయమని గుర్తు చేశారు. 2024లో ఏనుగుపై ఊరేగింపు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం షియా ముస్లింలను బాధించిందన్నారు. ప్రభుత్వం ఈసారి ఇలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎంత వైభవంగా, సంప్రదాయ బద్ధంగా మొహర్రం నిర్వహించిందో.. కాంగ్రెస్ సర్కారు కూడా అంతే వైభవంగా మొహర్రం నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందిస్తూ నిధుల విడుదల అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, మొహర్రంను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఆదేశాలు ఇస్తానని హామీఇచ్చారు.

# హత్యకేసులో
## భర్తకు జీవిత ఖైదు

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 13: మానసికస్థితి సరిగ్గాలేని భార్యను హత్య చేసిన భర్తతోపాటు అతడికి సహకరించిన మరొకరికి జీవిత ఖైదుతోపాటు ₹15వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి శివారులోని చెరువులో 2022 జూన్ 8న గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం కాగా, పోలీసులు కేసు దర్యాప్తు చేసి మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన అంజలిదిగా గుర్తించారు. పోలీసుల విచారణలో అంజలిని హత్యచేసింది భర్త రాజశేఖర్ అని తేలింది. అంజలి మానసిక ఆరోగ్యసమస్యలతో బాధపడుతుండగా, పలు దవాఖానలో చికిత్స చేయించినప్పటికీ బాగుకాలేదని, దీంతో ఆమెను హత్య చేయాలని రాజశేఖర్ నిర్ణయించుకున్నాడు. అతడి స్నేహితుడు అడువాల నరేశ్ సాయంతో 2022 జూన్ 7న అంజలిని మోరపెల్లికి తీసుకువచ్చి కత్తితో ఆమె గొంతుకోసి చెరువులో పడేసి వెళ్లారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి మహిళను హత్య చేసిన భర్త రాజశేఖర్‌తోపాటు అతడికి సహకరించిన నరేశ్‌కు జీవిత ఖైదుతోపాటు ₹15వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్షపడేందుకు కృషి చేసిన అడిషనల్ పీపీ మల్లేశం, అప్పటి సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ అనిల్, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ నరేశ్, సీఎంఎస్ కానిస్టేబుల్ రాజును ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

### ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి

మూడేళ్లుగా బెస్ట్ అవైలబుల్ స్కూల్ పాఠశాలల నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాల నిర్వాహకులుగా మేం ఆందోళనకు గురవుతున్నాం. హాస్టల్ విద్యార్థుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక బిల్డింగ్ అద్దెలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. ఉపాధ్యాయుల జీతాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ నెల 12వ తేదీ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వెంటనే బెస్ట్ అవైలబుల్ పాఠశాలల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతున్నాం. ఆ లోగా బకాయిలు విడుదల చేయలేని పరిస్థితుల్లో తక్షణమే బెస్ట్ అవైలబుల్ స్కూల్ బాధ్యత ప్రభుత్వం తీసుకొని పాఠశాలలు నడపాలని కోరుతున్నాం.

**- రాపోలు విష్ణువర్ధన్ రావు,**
**ట్రస్మా రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ, బీఏఎస్ స్కూల్ యజమాని**



# 25 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు!

**బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఫీజులు విడుదల చేయని సర్కారు**

- సొంత పార్టీ ఎమ్మెల్యేలు లేఖలు రాసినా పట్టని వైనం
- విద్యార్థుల ప్రవేశాలపై సందిగ్ధత
- మూసివేయడమే తప్ప మరో మార్గం లేదంటున్న నిర్వాహకులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

ఒకరిద్దరు కాదు.. 25 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద సర్కారు చెల్లించాల్సిన ఫీజులు విడుదల చేయకపోడమే అందుకు కారణమని తెలుస్తున్నది. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, బకాయిలు రిలీజ్ చేసి చదువులకు అండగా నిలువాలని సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నా కనికరం చూపడం లేదు. దీంతో ప్రవేశాలపై సందిగ్ధత నెలకొనగా.. బకాయిలు విడుదల చేయకపోతే మూసివేయడం తప్ప మరోమార్గం లేదని పాఠశాలల యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. దీంతో సంబంధిత వర్గాల తల్లిదండ్రుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

కరీంనగర్, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : విద్యాహక్కు చట్టంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో బెస్ట్ అవైలబుల్ స్కీంను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎంపిక చేసిన 210 ప్రైవేట్ పాఠశాలల్లో 25 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పథకం కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు, బోధన, వసతికి సంబంధించిన డబ్బులను ప్రభుత్వాలు చెల్లిస్తుండగా, ఏటా షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు ఒకటి, 5వ తరగతిలో.. గిరిజన విద్యార్థులకు సంబంధించి 1, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు సామర్థ్య పరీక్షను నిర్వహించి ఎంపిక చేసి.. గుర్తించిన ప్రైవేట్ పాఠశాలలకు కేటాయింపులు చేస్తారు. ఎంపికైన ప్రాథమిక తరగతి విద్యార్థికి ఏడాదికి ₹28వేలు, ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థులకు (వసతితో కలిపి) ₹42 వేలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. వీటి ద్వారా సదరు పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు ఒక్క పైసా విడుదల చేయలేదు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి రూ.వంద కోట్లకుపైగా రావాలని నిర్వాహకులు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలోపెట్టుకొని బకాయిలు విడుదల చేయాలని కోరుతూ విప్ ప్రస్తుత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టికి తాజాగా లేఖ రాశారు. వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ఆ లేఖలో కోరారు. అయినా ప్రభుత్వం మాత్రం కనికరం చూపడం లేదు. కనీసం ఇస్తామన్న అస్యూరెన్స్ కూడా ఇవ్వడం లేదు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద తమ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వసతి, భోజనం, విద్యను పొందుతున్న ప్రభుత్వాలు, తమకు నిధులను కేటాయించకుండా.. ఇబ్బందులు పెడుతున్న తీరుపై సదరు పాఠశాలల యజమానులనుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. అంతేకాదు, ఈనెల 12 నుంచి విద్యాసంవత్సరం ఆరంభమైంది. కొత్త అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బిల్లులు రాకపోతే నడిపే పరిస్థితి లేదని యాజమాన్యాలు చెబుతున్న తరుణంలో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### బెస్ట్ అవైలబుల్ హాస్టళ్ల పెండింగ్
## బిల్లులు చెల్లించాలి

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 13 : బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు చెందిన హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ బెస్ట్ అవైలబుల్ పేరెంట్స్ కమిటీ కరీంనగర్ జిల్లా శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కన్వీనర్ సముద్రాల అజయ్‌తో కలిసి కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మంది విద్యార్థులకు ₹200కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, ప్రతి క్వార్టర్ వైజ్‌గా విడుదల చేయాల్సిన నిధులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో, ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఈ పథకాన్ని కొనసాగించేందుకు ఆసక్తి ప్రదర్శించడం లేదని, దీంతో నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రీన్‌ఛానల్ ద్వారా పెండింగ్‌లో ఉన్న హాస్టల్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు విడుదల చేయాలని కోరారు.



కలెక్టరేట్ ఆవరణలో పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు

### ఇస్తారా.. ఇవ్వరా..? తేల్చిచెప్పాలి

మాకు స్కీంలు కావాలని అడుగడం లేదు. మాకు రావాల్సిన బకాయిలనే అడుగుతున్నాం. రేపు, మాపు వస్తాయి అనుకుంటూ ఇన్నాళ్లుగా అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి నడుపుకుంటూ వస్తున్నాం. ఎక్కడ ఇబ్బంది జరిగినా అది పేద పిల్లల చదువులకు ఆంటంకం కలుగుతుందన్న ఉద్దేశంతో కష్టాలు ఎదురైనా నడిపాం. కానీ, రోజురోజుకూ ఇది తలకు మించిన భారం అవుతున్నది. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఒక్క మాట స్పష్టంగా చెప్పాలి. బకాయిలు ఇస్తారా.. ఇవ్వరా..? ఇస్తే ఎప్పుడిస్తారో ముందుగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే నిలిపివేయడం తప్ప మాకు మారో మార్గం కనిపించడం లేదు. ఇది ప్రభుత్వాన్ని బెదిరించడానికి చెప్పడం లేదు. మా ఆర్థిక పరిస్థితులు సహకరించక ముందుకెళ్లలేక చెబుతున్నాం. ప్రభుత్వం అన్ని కోణాల్లో ఆలోచించి బకాయిలు విడుదల చేసి తమకు, విద్యార్థులకు అండగా నిలువాలని కోరుతున్నాం.

**- యాదగిరి శేఖర్‌రావు, ట్రస్మాగౌరవాధ్యక్షుడు,**
**బీఏఎస్ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి**


# స్వామి వేషంలో మోసం

- ఇంటి పక్కన బంగారం కడ్డీ ఉందని టోకరా
- ఐదుగురు దొంగబాబాల అరెస్ట్
- ₹15.30లక్షల బంగారం, మూడు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్



పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్ట్ చూపుతున్న రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్

కరీంనగర్, జూన్ 13 (నమస్తే తెలంగాణ)/ కొత్తపల్లి: స్వామి వేషంలో అమాయక ప్రజలను నమ్మించి బెదిరింపులకు పాల్పడుతున్న ఐదుగురు దొంగబాబాలను కరీంనగర్ రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ₹15.30లక్షల నగదు, ఏడు తులాల బంగారం, మూడు కార్లు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ వెల్లడించారు. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాములపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గజ్జి ప్రవీణ్ (25) వేములవాడ డిపోలో పని చేస్తున్నాడు. 15 రోజుల క్రితం ఒక ప్రమాదంలో అతడి ఎడమకాలు విరిగింది. అతడి తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ పరిస్థితిని ఆసరా చేసుకున్న స్వామిజీవేషంలో ఉన్న ఒక వ్యక్తి ప్రవీణ్ ఇంటి పక్కన క్వింటాల్ బంగారు కడ్డీ ఉన్నదని, దానిని బయటకు తీసి పూజలు చేస్తేనే ఆరోగ్యాలు బాగుంటాయని వారిని నమ్మించాడు. లేదంటే నెల రోజుల్లో ప్రవీణ్ తండ్రి కనకయ్య చనిపోతాడని బెదిరించాడు. అందుకు కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలు చేయాలని విడుతల వారీగా ₹15.30లక్షల వరకు వసూలు చేశాడు. అంతేకాకుండా ఇంటి పక్క గొయ్యితీసి కుంకుమ, పసుపు చల్లి అందులో నుంచి ఒక డబ్బా తీశాడు. అందులో కిలో బంగారం ఉందని చెప్పి, పూజాగదిలో పెట్టించాడు. ఆ తర్వాత ఇంకా డబ్బు కావాలని, లేదంటే కనకయ్యను చంపి ఇక్కడే పాతిపెడతామని బెదిరించాడు. దీంతో బెదిరిపోయిన ప్రవీణ్ మరికొంత డబ్బు అప్పుచేసి ఇచ్చాడు. తర్వాత మోసపోయానని గ్రహించి కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు.. రంగంలోకి దిగిన పోలీసులు చంద్రగిరికి చెందిన ఈర్నాల రాజు, అగ్రహారానికి చెందిన మిరియాల దుర్గయ్య, చీర్లవంచకు చెందిన పెనుగొండ రాజు, చల్ల అజయ్, ఈర్నాల సతీశ్ కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం చింతకుంట ఎక్స్‌రోడ్ వద్ద కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి బృందం వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు కార్లలో వేగంగా వస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకొన్నారు. వారి వద్ద నుంచి ₹15.30లక్షలు, ఏడు తులాల బంగారం, మూడు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు ఫోన్లు స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ మాట్లాడుతూ, పూజలు చేస్తామంటూ స్వాముల వేషాలు వేసుకొని తిరిగే వారిని నమ్మవద్దని, నకిలీ స్వాములపై అప్రమత్తంగా హెచ్చరించారు. ఇలాంటి స్వాముల చేతిలో మోసపోయిన వారు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కేసును ఛేదించిన సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ సాంభమూర్తిని సీపీ అభినందించారు.




# సివిల్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 13 : సివిల్ సర్వీసెస్‌లో అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, వంద మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా, మరో 50 మందిని గతంలో యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని గుర్తించి నేరుగా శిక్షణకు తీసుకుంటామని వెల్లడించారు. శిక్షణ తరగతులు జూలై 25 నుంచి ఏప్రిల్ 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన వారికి లాడ్జింగ్, భోజన, రవాణా ప్రయోజనాల కోసం నెలకు ₹5 వేలు, పుస్తకాల కోసం మరో ₹5 వేలు అందిస్తామని తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 16 నుంచి జూలై 8 వరకు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



చిగురుమామిడి: దవాఖాన ఆవరణలో మొక్కలు నాటుతున్న నేరస్తులు

# ఇసుక అక్రమ రవాణాదారులకు 'స్వచ్ఛ భారత్' శిక్ష

తిమ్మాపూర్/ చిగురుమామిడి, జూన్13 : ఇసుక అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 13 మందికి లోక్ అదాలత్‌లో భాగంగా ₹8 వేల జరిమానాతో పాటు ఒకరోజు వారి వారి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానల్లో స్వచ్ఛభారత్ చేపట్టాలని ఎక్సైజ్ కోర్టు జడ్జి శిక్ష విధించినట్టు ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇలాంటి శిక్ష ఇవ్వడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. చిగురుమామిడి ప్రభుత్వ దవాఖానలో ఒక్కొక్కరు రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షణ చూడాలని మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారని చిగురుమామిడి ఎస్ఐ చందబోయిన శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జరిమానా చెల్లించిన వారు కొందరు దవాఖాన ఆవరణలో మొక్కలు నాటారని చెప్పారు.